సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం ၊ 19 ၊ ఆగస్టు ၊ 2025



పశువధపై మొద్దు నిద్ర
తణుకు మండలం తేతలి గ్రామం పశు ఘోషతో అల్లాడుతోంది. పశువులను నిర్దాక్షిణ్యంగా వధిస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. 8లో



చివరి దశకు గ్రీన్‌ఫీల్డ్ హైవే
ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు చివరి దశకు చేరుకున్నాయి. సర్వీసు రోడ్లు నిర్మించాలని రైతులు కోరుతున్నారు. 8లో



దివ్య పవిత్రోత్సవాలు ప్రారంభం
లక్ష్మీపురం సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసుడి దివ్య పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. 8లో

న్యూస్‌రీల్

ఉప్పుటేరులోకి వరద నీరు



ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఆకివీడు: కొల్లేరు సరస్సులోకి కృష్ణా, గోదావరి జలాలతో పాటు, తమ్మిలేరు, బుడమేరు, ఎర్ర కాలువ నీరు ప్రవేశించడంతో కొల్లేరు, ఉప్పుటేరుల్లో నీటి ప్రవాహం పెరుగుతోంది. సోమవారం ఉప్పుటేరులో నీటి ప్రవాహాన్ని కలెక్టర్ నాగరాణి, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు పరిశీలించారు. తాడినాడ వైపు ఉప్పుటేరుకు చేర్చి ఉన్న చేపల చెరువులను కలెక్టర్ పరిశీలించారు. రైల్వే వంతెనల వద్ద పేరుకుపోతున్న కిక్కిస, గుర్రపుడెక్కల తొలగింపును చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కృషి

భీమవరం (ప్రకాశంచౌక్): అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనతో బలోపేతానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఐసీడీఎస్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు.

బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్

ఎక్సైజ్‌శాఖ అధికారి నాగప్రభుకుమార్



భీమవరం: జిల్లాలో బార్లు ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్టు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారి కేవీ నాగప్రభుకుమార్ తెలిపారు. సోమవారం భీమవరం ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 28 బార్లు ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. భీమవరం మున్సిపాలిటీ పరిధిలో ఏడు, నరసాపురంలో మూడు, పాలకొల్లులో ఆరు, తణుకులో ఆరు, ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో ఒకటి చొప్పున కేటాయించామన్నారు. ఈనెల 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రిజర్వేషన్ ఖరారు

కల్లుగీత కార్మికులకు కొత్తగా మంజూరైన మూడు బార్లుకు కులాల వారీగా రిజర్వేషన్ ప్రక్రియను లాటరీ ద్వారా కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఎంపిక చేశారు. భీమవరం, తాడేపల్లిగూడెంలో శెట్టి బలిజలకు, పాలకొల్లులో గౌడ కులస్తులకు ఒక్కోటి చొప్పున కేటాయించారు. వీరు ఈనెల 29 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, 30న డ్రా తీసి బార్లు కేటాయిస్తామన్నారు.

పింఛన్ల కుదింపునకు కుట్ర

అత్తిలి: రాష్ట్రంలో దివ్యాంగుల పింఛన్‌లు తొలగించడం హేయమని వైఎస్సార్‌సీపీ దివ్యాంగ విభాగం జిల్లా అధ్యక్షులు బుడితి సుజన్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైకల్యం పునః పరిశీలన పేరుతో దివ్యాంగులను నెలలు తరబడి తీవ్ర మానసిక వేదనకు గురిచేసిందని అన్నారు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా కాలు కదపలేని, ఏం పని చేసుకోలేని పలువురు దివ్యాంగుల పింఛన్లు తొలగించి వారి జీవనభృతిని లాక్కోవడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. తొలగించిన పింఛన్లను తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ చిత్తూరు కలెక్టరేట్‌ను దివ్యాంగులు ముట్టడించారని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్య పరిష్కారించాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు దిగుతామని సుజన్‌కుమార్ హెచ్చరించారు.

ఎడతెగని వాన



అత్తిలి మండలం కొమ్మరలో నీట మునిగిన పొలాలు

నిండా ముంచేను
- స్తంభించిన జనజీవనం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- 32 వేల ఎకరాల్లో నీట మునిగిన చేలు
- జిల్లాలో 15.4 మి.మీ నగటు వర్షపాతం నమోదు

సాక్షి, భీమవరం: పశ్చిమ, మధ్య వాయవ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం జిల్లా అంతటా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది. 32 వేల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. జిల్లాలో 15.4 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. వేకువజాము మొదలై మధ్యాహ్నం వరకు వర్షం పడుతూనే ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాయంత్రం వరకు జల్లులు కొనసాగాయి. పాలకొల్లు, ఉండి, నరసాపురం, పెనుగొండ, తణుకు ప్రాంతాల్లో ఎక్కువగా, తాడేపల్లిగూడెం, భీమవరం, ఆకివీడు, అత్తిలి తదితర చోట్ల మోస్తరుగా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. అధిక శాతం మంది ఇళ్లకే పరిమితం కాగా విద్యాసంస్థలు, కార్యాలయాలు, షాపులకు వెళ్లేవారు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. జనం లేక మార్కెట్లు వెలవెలబోయాయి. రోడ్లు మరమ్మతుల్లో భాగంగా తూతూమంత్రంగా గుంతలు పూడ్చడంతో వర్షాలకు రాళ్లుపైకి లేచి ప్రమాదభరితంగా తయారయ్యాయి.

నీటమునిగిన పంట పొలాలు

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట పొలాలు నీటమునిగాయి. జిల్లాలోని 2.8 లక్షల ఎకరాల్లో రైతులు తొలకరి సాగు చేస్తున్నారు. 88 శాతం విస్తీర్ణంలో నాట్లు పూర్తయ్యాయి. డెల్టా ఎగువ ప్రాంతమైన తాడేపల్లిగూడెం, ఉండి, భీమవరం, తణుకు నియోజకవర్గాల్లో నాట్లు దాదాపు పూర్తికాగా ఆచంట, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లోని శివార్లలో ఇంకా సాగుతున్నాయి. ముందుగా నాట్లు వేసిన చోట చేలు పిలకలు వేసే దశలో ఉన్నాయి. వర్షాలతో జిల్లావ్యాప్తంగా దాదాపు 32 వేల ఎకరాల్లో పొలాలు నీట మునిగినట్టు వ్యవసాయ వర్గాల ప్రాథమిక అంచనా. తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో ఐదు రోజులుగా పొలాలు నీట మునిగి ఉన్నాయని, నాట్లు పనికి రాకుండా పోతాయని రైతులు చెబుతున్నారు. వర్షం తెరిపివ్వకుంటే మరిన్ని పొలాలు నీట మునిగే అవకాశం ఉందంటున్నారు. రెండు, మూడు రోజుల క్రితం ఊడ్చిన పొలాల్లోని నాట్లు పైకి తేలిపోతుండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. పొలాల్లోని ముంపు నీరు బయటకు పోయేందుకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని, నాట్లు వేసిన నీట మునిగి మొక్కలు చనిపోతే మసేదలు వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

వరిలో జాగ్రత్తలు తప్పనిసరి

ముంపు పొలాల్లో నష్టనివారణకు మార్టేరులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. ఎం.గిరిజారాణి పలు సూచనలు చేశారు.

- నారుమడి లేక ఎద పద్ధతిలో విత్తిన పొలం నీట మునిగితే మొలక శాతం తగ్గుతుంది. విత్తిన వారం రోజుల నుంచి నెల రోజుల్లో ఐదు రోజులకు పైగా నారుమడి నీట మునిగి ఉంటే నారు దెబ్బతినే అవకాశం ఉంది. వీలైనంత తొందరగా నీటిని బయటకు తీసివేసి, తర్వాత 5 సెంట్ల నారుమడికి ఒక కిలో యూరియా, కిలో పోటాష్ వేయాలి. ఈ వాతావరణంలో తెగుళ్ల సోకకుండా లీటరు నీటికి ఒక గ్రాము కార్బెన్డిజిమ్ లేదా 2.0 గ్రాములు కార్బెన్డిజిమ్, మాంకోజెబ్ కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పిలకల దశలో సాధారణ రకాలు ఐదు రోజుల వరకు, ఎంటీయూ 1064, పీఎల్‌ఏ 1100 వారం రోజుల వరకు ముంపును తటుట్టకుంటాయి. ఆకులు పైకి కనిపిస్తూ 30 నుంచి 40 సెంటీమీటర్ల నీరు నిలబడే పల్లపు ప్రాంతల్లోని మధ్యస్థ ముంపుని కూడా తట్టుకుంటాయి.
- ఎంటీయూ 1232 రకం 10 నుంచి 12 రోజుల పాటు తాత్కాలిక ముంపును కూడా తట్టుకుంటుంది. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత త్వరగా నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా, 10 నుంచి 15 కిలోల పొటాష్ అదనంగా వేయాలి.

రెండు రోజులు భారీ వర్షాలు

జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి అధికారులతో ఆయన వెబ్‌ఎక్స్ ద్వారా సమీక్షించారు. రానున్న రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని, అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని జిల్లా యంత్రాంగానికి అందించాలన్నారు. ముంపు చేలల్లో నీరు బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలు, డ్రెయిన్లలో అడ్డంకులు తొలగించాలన్నారు. గట్లు బలహీనంగా ఉంటే పటిష్టం చేయాలన్నారు. లోతటు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టే వరకూ జిల్లాలోని సచివాలయ సిబ్బంది షిఫ్టుల వారీగా విధుల నిర్వహించాలన్నారు. అధికారులంతా జిల్లా ప్రధాన కేంద్రంలోనే ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేశామని, 24 గంటలు సేవలందిస్తారన్నారు.

రైతులను ఆదుకోవాలి

మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

వర్షాల కారణంగా తాడేపల్లిగూడెం, పెంటపాడు మండలాల్లో ముంపు ప్రాంతాల్లో మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పర్యటించారు. కె.పెంటపాడు, బోడపాడు, వల్లూరుపల్లి, మంజిపాడు, యనమలపల్లి తదితర గ్రామాల్లో పంట పొలాలు, లోతట్టు ప్రాంతాలను పరిశీలించి రైతులు, స్థానికులతో మాట్లాడారు. డ్రెయిన్లు లాగక ఐదు రోజులుగా పొలాల్లోని ముంపు నీరు బయటకు పోవడం లేదని, నాట్లు ఎందుకు పనికి రాకుండా పోతాయని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ డిమాండ్ చేశారు.



పెంటపాడు మండలంలో ముంపు చేలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొట్టు

మురుగుకోడుతో ముంపు

గణపవరం: మండలంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న చేలను జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి పరిశీలించి నష్టం వివరాలు తెలుసుకున్నారు. జల్లికొమ్మరలో నీట మునిగిన సార్వా పైరును పరిశీలించారు. వియర్ మురుగుకోడు కారణంగా 500 ఎకరాల పైరు నీట మునిగిందని, ఐదు రోజులుగా నాట్లు నీటిలో ఉన్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. శాశ్వత పరిష్కారంగా పంట, మురుగు కాలువలను పూర్తిస్థాయిలో తవ్వాలన్నారు. పంటల బీమా పరిహారం ఇప్పించాలని కోరారు. ప్రభుత్వానికి నివేదిక సమర్పించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తానని జేసీ అన్నారు. ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేసి మ్యూటేషన్ ఫైల్స్‌ను పరిశీలించారు. వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ఏఓ ఆర్ఎస్ ప్రసాద్ ఉన్నారు.



వెంకయ్య కాలువ ఉధృతిని పరిశీలిస్తున్న జేసీ

ఇదేనా.. పంట కాలువల ప్రక్షాళన?





లక్షలాది రూపాయలు వెచ్చించి పంట కాలువలను ప్రక్షాళన చేశారుగా.. అప్పుడే ఇలా అయిపోయాయి ఏంటి అంటూ రైతులు, స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉండి నుంచి పాములపర్రు వెళ్లే పంట కాలువ ఓ వైపు చిట్టడవిలా మారితే.. మరో వైపు గుర్రపుడెక్క, చెత్తాచెదారంతో నిండిపోవడంపై అవాక్కవుతున్నారు. గత వేసవిలో కాలువల్లో పూడికతీత పనులను అధికారులు, కాంట్రాక్టర్లు తూతూమంత్రంగా కానిచ్చేశారని, కాలువల్లోని మట్టిని పొక్లెయిన్‌తో గట్టుపై వేసి చేతులు దులుపుకున్నారని అంటున్నారు. దీంతో కొద్దిరోజుల్లోనే పంట కాలువలు ఇలా తయారయ్యాయని వాపోతున్నారు. కాలువల్లో అడ్డంకులతో పొలాలకు నీరందడం లేదని ఆవేదన చెందుతున్నారు. – ఉండి

రాష్ట్రంలో విద్యావ్యవస్థ నాశనం

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నిరసన



భీమవరంలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ నాయకులు

భీమవరం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని, పేద విద్యార్థులు సక్రమంగా చదువుకునే అవకాశం లేకుండా చేస్తోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అరిగేల అభిషేక్ ధ్వజమెత్తారు. విద్యావ్యవస్థలో ప్రభుత్వ అసంబద్ధ నిర్ణయాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం భీమవరం అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలిపారు. అభిషేక్ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ నాడు-నేడు పథకంతో సర్కారీ బడులను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారని, పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒక్క పాఠశాలను అభివృద్ధి చేయకపోగా.. పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యలు తాండవిస్తున్నాయన్నారు.

సమస్యల తాండవం

జిల్లా ఉపాధ్యక్షుడు తమనంపూడి సూర్యరెడ్డి, స్టేట్ జాయింట్ సెక్రటరీ గంటా రాహుల్ మాట్లాడుతూ ఇటీవల వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పాఠశాలలు, హాస్టళ్లను సందర్శించి అక్కడి సమస్యలను కలెక్టర్ నాగరాణి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, హాస్టళ్లలోని అవకతవకలు, ఇబ్బందులను ప్రజల దృష్టికి తీసుకువస్తుండటంతో విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకులు విద్యాసంస్థలు, హాస్టళ్లలోకి వెళ్లకూడదని మంత్రి నారా లోకేష్ ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. ఆ ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను దగా చేస్తోందన్నారు. జిల్లా జాయింట్ సెక్రటరీ నేకూరి గణేష్, తాడేపల్లిగూడెం రూరల్ ప్రెసిడెంట్ తాడిపల్లి అనిల్ కుమార్, తాడేపల్లిగూడెం రూరల్ ఉపాధ్యక్షుడు జాలపర్తి సురేష్, సెక్రటరీ కొండపల్లి శివనాగ ఉదయ్ భాస్కర్, తణుకు నియోజకవర్గ ప్రెసిడెంట్ ఎడ్వర్డ్ పాల్, మేడిది జాన్సన్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల విజృంభణ

- వాతావరణంలో మార్పులతో వ్యాధులు
- వైరల్, టైఫాయిడ్ బారిన ప్రజలు
- అధ్వానంగా పారిశుద్ధ్యం
- దోమల నివారణ చర్యలు శూన్యం
- 1,500కు పైగా కేసుల నమోదు



భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

కాళ్ల మండలం బొండాడపేటకు చెందిన కె.లక్ష్మణరావుకు జ్వరం రావడంతో మూడు రోజులు ఇంటి వద్దే ఉన్నాడు. అప్పటికీ తగ్గకపోవడంతో భీమవరం ప్రభుత్వాస్పత్రిలో చేరి మూడు రోజుల నుంచి చికిత్స పొందుతున్నాడు.

భీమవరానికి చెందిన లక్ష్మి అనే మహిళ ఆరు రోజులుగా జ్వరంతో బాధపడుతూ భీమవరం ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్నారు.

భీమవరానికి చెందిన ఎండీ నిషార్ అనే వ్యక్తి వారం రోజులుగా జ్వరంతో బాధపడి భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇంటి వద్ద రెండు, మూడు రోజులపాటు జ్వరంతో బాధపడిన తర్వాత ఆస్పత్రిలో చేరాడు.

ఇలా జిల్లావ్యాప్తంగా జ్వరాల కేసులు నమోదవుతున్నాయి.

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాలో వాతావరణంలో మార్పులు, క్షీణించిన పారిశుద్ధ్యం, దోమల బెడదతో జ్వరాలు విజృంభిస్తున్నాయి. కొద్ది రోజులపాటు ఎండ వేడిమి, మరి కొద్దిరోజులపాటు భారీ వర్షాలు వ్యాధులు ప్రబలేందుకు కారణమవుతున్నాయి. దీంతో జిల్లావ్యాప్తంగా వైరల్, టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. జిల్లాలోని 20 మండలాల్లో 409 గ్రామాలు ఉండగా ప్రతి గ్రామంలో జ్వరపీడితులు కనిపిస్తున్నారు. జ్వరం వచ్చి రెండు, మూడు రోజులపాటు తగ్గకపోవడంతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఇలా పట్టణాల్లో ఆస్పత్రుల్లో రోజుకు 20 వరకు జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. దీంతోపాటు ప్లేట్‌లెట్స్ తగ్గి ఆస్పత్రుల్లో చేరుతున్న వారు ఉంటున్నారు.

సుమారు 1,500 కేసులు

ఆగస్టు నెల ప్రారంభం నుంచి జ్వరపీడితులు పెరుగుతున్నారు. జిల్లాలో ఈనెల 11 నుంచి 17 వరకు 19 టైఫాయిడ్, ఒక డెంగీ కేసు నమోదయ్యాయి. జనవరి నుంచి ఇప్పటివరకూ 2 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ నెలలో పది రోజుల్లో సుమారు 1,500కు పైగా జ్వరాలు కేసులు నమోదయినట్టు అంచనా. వైద్యారోగ్య శాఖ అధికారులు రక్తనమూనాలు సేకరించిన వారి వివరాలు మాత్రమే లెక్కల్లో చూపిస్తున్నారు. అయితే వాస్తవంగా జ్వరాల కేసులు చాలా ఎక్కువగా ఉంటున్నాయి.

అరకొర సేవలు

జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో జ్వరపీడితులకు అరకొర వైద్య సేవలు అందుతున్నాయి. జనరల్ మెడిసిన్, ఎండీ స్థాయి వైద్యుల కొరత ఉంది. అలాగే సరైన రక్తపరీక్ష ల్యాబ్‌లు లేకపోవడం, ఉన్న ల్యాబ్‌లో సిబ్బంది కొరతతో పూర్తిస్థాయిలో సేవలందడం లేదు. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకు జనం క్యూ కడుతున్నారు.

దోమల నివారణకు చర్యలు లేవు

జిల్లాలో వైరల్, టైఫాయిడ్ జ్వరాలు విజృంభిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడం కనీసం బ్లీచింగ్, ఫాగింగ్ చేయడం లేదని పట్టణవాసులు వాపోతున్నారు. పలుచోట్ల డ్రెయినేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. రోడ్డు మార్జిన్లు చెత్తతో నిండిపోతున్నాయి. వైద్యారోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యంతో జ్వరాల కేసుల వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడం లేదని పలువురు అంటున్నారు. వైద్యారోగ్య శాఖ అధికారులు లెక్కల్లో తక్కువ జ్వరాల కేసులు చూపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. జ్వరాలపై సరైన సర్వే జరగడం లేదని తెలుస్తోంది.

గోదావరి వడివడి.. కొల్లేరులో అలజడి

- జిల్లాను చుట్టుముడుతున్న వరద
- పరవళ్లు తొక్కుతున్న గోదావరి
- తమ్మిలేరు, బుడమేరు, రామిలేరు నుంచి కొల్లేరులోకి నీరు
- పెనుమాకలంకకు రాకపోకలు బంద్
- వేలేరుపాడులో ముంపులోనే ఎద్దులవాగు వంతెన
- పోలవరం నుంచి 6.70 లక్షల క్యూసెక్కులు దిగువకు..



పెదఎడ్లగాడి వంతెన వద్ద గుర్రపుడెక్కతో నిండిన కొల్లేరు (డ్రోన్ చిత్రం)

సాక్షి ప్రతినిధి, ఏలూరు/కైకలూరు/పోలవరం/కుక్కునూరు: ఓ వైపు గోదావరి ఉధృతం.. మరో వైపు ప్రధాన కాలువల నుంచి కొల్లేరుకు భారీగా వచ్చి చేరుతున్న నీటితో ఏలూరు జిల్లాను వరద చుట్టుముడుతోంది. ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువలో గోదావరి, కొల్లేరు నీరు చేరడంతో లంక, ముంపు గ్రామాల్లో ఆందోళన నెలకొంది. అల్పపీడన ప్రభావంతో జిల్లాతో పాటు ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి, శబరి నదులతో పాటు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రెండు రోజుల్లో మొత్తంగా 9 లక్షల క్యూసెక్కుల నీరు ఎగువ ప్రాంతాల నుంచి పోలవరం ప్రాజెక్టుకు చేరింది. సోమవారం భద్రాచలం వద్ద 38 అడుగుల మేర నీటిమట్టం చేరింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే 31.050 మీటర్ల ఎత్తు నుంచి 6,70,355 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మరో 48 గంటల పాటు వరద ఉధృతి కొనసాగి మంగళవారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉంది. గోదావరి, శబరికి ఎగువ నుంచి 15 లక్షలకుపైగా క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుందని అంచనా.

ముంపు మండలాల్లో..

వేలేరుపాడు మండలంలోని కొయిదా, కట్కూరు, సిద్దారం, కాచారం, పూసుకుంది, తాళ్ల గొంది, పేరంటపల్లి, టేకుపల్లి, టేకూరు, బుర్రారెడ్డిగూడెం, ఎర్రమెట్ట, ఎడవల్లి, చిట్టం రెడ్డిపాలెం, మరో ఐదు గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. ఎద్దుల వాగు వంతెన నీట మునగడంతో నాటు పడవ ద్వారా రాకపోకలు కొనసాగిస్తున్నారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ అయితే వేలేరుపాడులో పునరావాస శిబిరం ఏర్పాటు చేసి ఐదు గ్రామాల ప్రజలను తరలించడంపై అధికారులు దృష్టి సారించారు. కుక్కునూరులో గుండేటి వాగు వంతెన నీటమునిగింది.

ఉధృతంగా కొల్లేరు

కొల్లేరు పూర్తి జలకళతో నిండుకుని రోడ్లపైకి నీరు చేరుతోంది. కృష్ణా జిల్లా నుంచి బుడ మేరు, రామిలేరు, తెలంగాణ నుంచి మున్నేరు, తమ్మిలేరుకు వరద ప్రవాహం ఉండటంతో అన్ని కాలువలు కొల్లేరులో కలుస్తున్నాయి. దీంతో ఆదివారం నుంచి కొల్లేరు లంక గ్రామాల్లో అలజడి మొదలైంది. సోమవారం మండవల్లి మండలం పెదఎడ్లగాడి వంతెన వద్ద 2.5 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి 67 డ్రెయిన్ల ద్వారా 1.10 లక్షల క్యూసెక్కుల నీరు కొల్లేరుకు చేరుతుంది. నీరంతా కైకలూరు నియోజకవర్గం మండవల్లి మండలం పెదఎడ్లగాడి, చినఎడ్లగాడి, పోల్‌రాజ్ కాల్వల ద్వారా ఉప్పుటేరు మీదుగా సముద్రంలో కలుస్తుంది. వాస్తవానికి కొల్లేరుకు చేరుతున్న 1.10 లక్షల క్యూసెక్కుల నీటిలో 12 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే దిగువకు వస్తుంది.

పెనుమాకలంకకు రాకపోకలు బంద్

మండవల్లి మండలం పెదఎడ్లగాడి నుంచి పెనుమాకలంక, నందిగామలకం, ఇంగిళిపాకలంక గ్రామాలకు చేరే రహదారిపై మూడు ప్రాంతాల్లో వరద నీరు ప్రవహిస్తోంది. పెదఎడ్లగాడి నుంచి పడవలపై ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. పెనుమాకలంక రహదారి వద్ద ప్రవేశం లేదని పోలీసులు ఫ్లెక్సీ ఏర్పాటుచేశారు. మండవల్లి మండలంలో పులపర్రు, కొవ్వాడలంక, మణుగునూరులంక, తక్కెళ్లపాడు, చింతపాడు గ్రామాలు, కైకలూరు మండలంలో పందిరిపల్లిగూడెం, కొట్టాడ, శృంగవరప్పాడు, పెంచికలమర్రు గ్రామాలు నీట మునిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గుబులు పుట్టిస్తున్న గుర్రపుడెక్క

కొల్లేరుకు చేరే నీటిని సముద్రానికి పంపించే ప్రధాన పెదఎడ్లగాడి వంతెనకు 56 ఖానాలకు గాను 20 ఖానాల్లో గుర్రపుడెక్క పేరుకుపోయింది. పొక్లెయిన్‌తో డెక్కను తొలగిస్తున్నారు. గుర్రపుడెక్క పరిష్కారానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని కొల్లేరు పరీవాహక ప్రజలు కోరుతున్నారు. డెక్కతో పచ్చటి తివాచీ పరుచుకున్నట్టు కొల్లేరు కనిపిస్తోంది.

క్లుప్తంగా

చోరీపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: స్థానిక పద్మ థియేటర్ సమీపంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. మాచవరపు రాము ఈ నెల 12న కుటుంబసభ్యులతో విశాఖపట్నం వెళ్లాడు. ఈ నెల 17న తిరిగి వచ్చి చూసుకునే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలో ఉంచిన బంగారు చెవిదుద్దులు, చైన్ చోరీకి గురైనట్లు గుర్తించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జ్ఞానేశ్వర్


జ్ఞానేశ్వర్

భీమవరం: అండర్–19 బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు టి.జ్ఞానేశ్వర్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని సోమవారం భీమవరం విష్ణు కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ వెల్లడించారు. జ్ఞానేశ్వర్ గన్నవరం సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ఈ నెల 17న జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటడంతో అతన్ని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారని చెప్పారు.

సప్త ప్రదక్షిణల్లో పాల్గొన్న భక్తులు


క్షీరారామంలో సప్త ప్రదక్షిణల్లో మహిళలు

పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సప్తప్రదక్షిణల్లో భాగంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ప్రదోషకాలంలో భక్తులు ప్రదక్షిణలు మొదలుపెట్టారు. ప్రదక్షిణల అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. రాత్రి 7.30 గంటలకు స్వామికి పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, ఆలయ అర్చకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

భార్యాబిడ్డల అదృశ్యంపై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: భార్యతో పాటు ఇద్దరు బిడ్డలు కనిపించకుండా పోయారంటూ వ్యక్తి చేసిన ఫిర్యాదుపై స్థానిక పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని శ్రీహరిపురానికి చెందిన సనక రవీంద్ర తాపీపని చేస్తుంటాడు. రవీంద్ర, భార్య లక్ష్మీశిరీష మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నెల 15న భార్య లక్ష్మీశిరీష తనతో పాటు కుమారులను తీసుకుని బయటకు వెళ్లిపోయింది. గ్రామంలో వెతకడంతో పాటు అత్తమామలను విచారించగా తమ వద్దకు రాలేదని చెప్పారు. ఈ నేపథ్యంలో భార్యపిల్లలు కనిపించడం లేదంటూ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేయగా ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. స్థానిక ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ చదువుతున్న యువతి ఈనెల 17వ తేదీ ఉదయం కాలేజీకి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పశువధపై మొద్దు నిద్ర

- దుర్వాసనతో ఉండలేకపోతున్నామని బాధితుల ఆందోళన
- టీడీపీ, జనసేన పార్టీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- కర్మాగారానికి నిత్యం వ్యాన్‌లలో పశువులు
- గేదెలు అపహరణకు గురవుతున్నాయని పశుపోషకుల ఫిర్యాదు


తణుకు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద రోడ్డుపై బైఠాయించిన బాధిత మహిళలు(ఫైల్)


తేతలిలో గోసేవా సమితి సభ్యులు పట్టుకున్న పశువుల వ్యాన్‌లు(ఫైల్)

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి గ్రామం పశు ఘోషతో అల్లాడుతోంది. పశువులను నిర్దాక్షిణ్యంగా వధిస్తున్నప్పటికీ పట్టించుకునే వారు లేకపోవడంతో బాధితులకు కంఠశోష మిగిలింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నుంచి పశువధ శాల తెరచుకుంది. అక్కడి నుంచి వస్తున్న దుర్వాసనకు తేతలి గ్రామస్తులు అల్లాడిపోతున్నారు. స్థానికంగా ఇళ్లలో ఉండలేకపోతున్నామని పశువధ శాలను మూయించాలని వేడుకుంటున్నారు. పశువధ శాల చుట్టూ 200పైగా ఇళ్లు ఉన్నా కూటమి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మహిళలపై దాడులకు దిగిన వైనం

పశు వధను నిలిపివేయాలని బాధితులు కర్మాగారం వద్ద నిరసనలు తెలుపుతూ వ్యాన్‌లను అడ్డుకుంటే దాడులు చేశారు. రోడ్డుపై బైఠాయిస్తే కేసులు పెట్టారు. పశువధను నిలిపించమని కాళ్లు పట్టుకుంటామన్నామని, రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేసినప్పటికీ కూటమి ప్రభుత్వానికి కనికరం లేదని బాధితులు మండిపడుతున్నారు. శాంతియుతంగా చేస్తున్న నిరసన శిబిరాలను పోలీసులు తొలగించారని, ఇదంతా కూటమి నేతల కనుసన్నల్లోనే జరుగుతుందని బాధిత వర్గాలు బాహాటంగానే విమర్శిస్తున్నాయి.

టీడీపీ, జనసేన కార్యాలయాలకు వెళ్లినా..

పశువధ శాల బాధితులు తాడోపేడే తాడేపల్లిలోనే తేల్చుకుంటామని మంగళగిరిలోని టీడీపీ, జనసేన కార్యాలయాలకు బస్సులు వేసుసుని వెళ్లి వినతి పత్రాలు అందచేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఫలితం లేదు. పశువధకు సంబంధించి తణుకు నియోజకవర్గంలో చోద్యం చూస్తున్న జనసేన, బీజేపీ వర్గాలపైనా బాధితులు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. టీడీపీతో అంటకాగుతూ బీజేపీ నాయకులు సైతం పశుఘోషలో భాగస్వామ్యమయ్యారని మండిపడుతున్నారు.

మూడు జిల్లాల నుంచి పశువుల తోలకం

తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న పశువధ శాలకు పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు గ్రామాలతోపాటు ఏలూరు, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల నుంచి పశు బేరగాళ్లు పశువులను రవాణా చేస్తున్నారు. దొంగిలించిన గేదెలు సైతం తేతలిలోని పశువధ శాలకు తోలుకువస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు జిల్లాల నుంచి తమ గేదెలు దొంగిలించారంటూ పశుపోషకులు తణుకు ప్రాంతానికి వచ్చి వెతుకులాడే పరిస్థితి తెచ్చారు. గతంలో తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన పశుశాలలో దొంగిలించిన రెండు ఖరీదైన గేదెలు కూడా ఇదే పశువధ శాలకు తరలించారని అందుకే పోలీసులు రికవరీ చేయలేకపోయారనే ఆరోపణలు అప్పట్లో గుప్పుమన్నాయి.

ఆందోళనకు మద్దతు పలికిన వైఎస్సార్‌సీపీ

పశువధ శాల నుంచి దుర్వాసన వస్తుందని బాధితులు నిరసన తెలిపిన వెంటనే వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పట్లో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పశువధ శాల నిర్వహణకు తెరదించుతూ తాళాలు వేయించారు. కూటమి ప్రభుత్వం రాగానే తిరిగి పశువధ శాల గేట్లు తెరచుకున్నాయని, నిర్వహణ మొదలుపెట్టడంతో దుర్వాసనతో ఉండలేకపోతున్నామని స్థానిక బాధితులు రోడ్డెక్కగానే వైఎస్సార్‌సీపీ తరపున కారుమూరి వారికి అండగా నిలిచారు.

రాజకీయ సహకారంతోనే..



వ్యాపార, వాణిజ్య పరంగా దినదినాభివృద్ధి చెందిన పచ్చని తణుకు పరిసర ప్రాంతంలో పశువధ వద్దంటూ ప్రజలు రోడ్డెక్కినా ప్రభుత్వం దిగి రాలేదు. పశువుల నుంచి చిమ్ముతున్న రక్తం ఈ ప్రాంతానికి మంచిది కాదన్నా వినలేదు. చివరకు ఆ ప్రాంత వాసులు దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని రోడ్డెక్కితే కేసులు పెట్టారు. పంచాయితీ ఎన్‌ఓసీ లేదని, ఆ కర్మాగారానికి ఎలాంటి అనుమతులు లేవని, వారు చూపిన సౌకర్యాలు అక్కడలేవని నిర్ధారణ చేసినా కానీ రాజకీయ ప్రోత్సాహంతో పశువధ నేటికీ ముమ్మరంగా సాగుతోంది.

– జల్లూరి జగదీష్, గోసేవాసమితి సభ్యులు

విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వర్షాల సమయంలో విద్యుత్‌తో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ఈపీడీసీఎల్ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పీ సాల్మన్ రాజు సూచించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలక్ట్రిక్ తీగలు, ఇతర పరికరాల దగ్గర గుమికూడవద్దన్నారు. తడి చేతులతో ఎలక్ట్రిక్ స్విచ్ ఆన్, ఆఫ్ చేయవద్దని, ఇళ్లలో తడి నేలపై ఎలక్ట్రిక్ తీగలు, పరికరాలు పడకుండా జాగ్రత్తపడాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగి పడివుంటే, వాటిని తాకవద్దని, గమనించిన వెంటనే 1912 నంబర్‌కి సమాచారం ఇవ్వాలన్నారు. వర్షపు నీటితో నిండిన ప్రదేశాల్లో, పొలాల్లో, రోడ్లలో ఉన్న ఎలక్ట్రిక్ లైన్ల దగ్గర తిరగవద్దని, విద్యుత్ తీగలు, స్తంభాల దగ్గర గుడారాలు, షెడ్‌లు, టెంట్లు వేయకూడదన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

కాళ్ల: మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తులకు న్యాయమూర్తి రూ.80 వేలు జరిమానా విధించినట్లు కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గతంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 8 మందిని భీమవరం స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి సదరు వ్యక్తులకు ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.80 వేలు జరిమానా విధించారన్నారు.

ఎర్ర కాలువ జలాశయానికి వరద

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం కొంగువారిగూడెం కరాటం కృష్ణమూర్తి ఎర్రకాలువ జలాశయానికి 1000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని జలాశయ ఏఈ రాహుల్ భాస్కర్ తెలిపారు. జలాశయం పూర్తి నీటిమట్టం 83.50 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 81.35 మీటర్లుగా ఉందన్నారు. జలాశయం కుడి కాలువ నుంచి 100 క్యూసెక్కులు, ఎడమ కాలువ నుంచి 50 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

నిరుపేదల బతుకులు రోడ్డు పాలు

- బొండాడ డ్రెయిన్ గట్టుపైన గుడిసెలు కూల్చివేత
- నీడలేక నానా పాట్లు పడుతున్న పేదలు
- 15 మంది చిన్నారులు చదువులకు దూరం


విద్యుత్ మీటర్లు ఇవ్వాలంటూ ఉండిలో కరెంట్ ఆఫీసు వద్ద నిలబడ్డ నిరుపేదలు

ఉండి: డ్రెయిన్ గట్టున ఉంటున్న వారి గుడిసెలను కూలగొట్టి విద్యుత్ మీటర్లు తొలగించి వారిని వెళ్లగొట్టారు. నిరుపేదలైన ఏమీ చేయలేరు కదా అని వారిపై అధికారులు జులుం చేశారు. విద్యుత్ మీటర్లను పట్టుకుపోయారు. సోమవారం ఉదయం ఉండి 33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కొందరు పేదలు అధికారులను వేడుకుంటూ నిలబడ్డారు. ఈ సందర్భంగా వారి ఆవేదనంతా వెలిబుచ్చారు. కొంతకాలం క్రితం నుంచి ఉండిలో మసీదుకు ఎదురుగా అరుంధతీ పేటకు వెళ్ళే దారిలో బొండాడ డ్రెయిన్ పక్కనే గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వాటికి విద్యుత్ మీటర్లు మంజూరు చేశారు. దీంతో నీడలేక నానాపాట్లు పడుతున్న వారి జీవితాల్లో వెలుగులు వచ్చాయనుకున్నారు. ఊరూరా తిరిగి వేషాలు వేసుకుని జీవించే వారి జీవితాలకు ఒక స్థిర నివాసం, అడ్రస్సు ఏర్పడింది. రేషన్ కార్డు, ఆధార్ కార్డులు లభించాయి. వారి పిల్లలు ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. గౌరవప్రదంగా జీవించాలని వారు కన్న కలలు కూటమి నాయకుల రూపంలో దూరమవుతుందని వారు కలలో కూడా అనుకోలేదు. కూటమి నాయకులు చేసిన పనికి నాలుగు గుడిసెల్లో వుంటున్న 8 కుటుంబాలకు చెందిన నిరుపేదలు నిలువనీడ లేక రోడ్డుపై నిలబడ్డారు. స్థానిక ఎమ్మెల్యే ఏదో కడుతున్నారని గుడిసెలను తొలగించారు. ఇప్పటికీ ఏ పని ప్రారంభించ లేదు. తమ జీవితాలు చిందర చేశారంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.

కాళ్లావేళ్లా పడ్డా కరుణించని అధికారులు

అధికారులను, ప్రజాప్రతినిధులను ఎదురించే ధైర్యం లేక ఎంతో మందిని సహాయం కోసం అరించారు. ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో వారికున్న కొన్ని సామాన్లు తీసుకుని ఉండిలోనే విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కనే ఓ ఖాళీస్థలంలో బరకాలు, పాతబట్టలతో గుడిసెలు వేసుకున్నారు. ఒకవైపు విషసర్పాలు, మరోవైపు చిమ్మచీకటితో వారి జీవితాలు దుర్భరంగా మారాయి. పిల్లలు చదువులకు దూరం కావడంతో ఏం చేయాలో పాలుపోక సోమవారం విద్యుత్ అధికారులకు దండాలు పెడుతూ ఆఫీసు ముంగిట భార్య బిడ్డలతో నిలబడ్డారు. మమ్మల్ని కనికరించి మాకు విద్యుత్ మీటర్లు ఇప్పిస్తే మా బతుకులు మేం బతుకుతాం.. మాకు దారి చూపించండి బాబూ అంటూ కాళ్ళా వేళ్లా పడ్డారు. గత ఎన్నికల్లో కూటమి నాయకులు ఎన్నో వాగ్దానాలు చేశారని.. మా జీవితాల్లో చాలా అభివృద్ధి వస్తుందని ఊహించిన వారికి నిలువనీడ లేకుండా పోతుందని అనుకోలేదని వారు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ మీటర్లు తొలగించాలని పంచాయతీ కార్యదర్శి అనిల్ లెటర్ పెట్టారని, అందుకే మీటర్లను తొలగించామని ఏఈ పులగం శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరేందుకు సంప్రదించగా ఆయన అందుబాటులో లేరు.

మాపై ఎందుకు కక్ష?



నా చిన్నతనం నుంచి ఉండిలోనే వుంటున్నాం. బతికేందుకు జాగా లేదు. చివరకు ఉండి బొండాడ డ్రెయిన్ పక్కగా గుడిసెలు వేసుకుని ఒక జీవితాన్ని ప్రారంభించాం. మా పిల్లలకు మా పరిస్థితి రాకుండా మంచి జీవితం ఇవ్వాలనుకున్నాం. ఇప్పుడు మా ఇళ్లు అడ్డొస్తున్నాయని తీసేసారు. తనుకు గొల్లమ్మ, బాధితురాలు, ఉండి

మా బతుకులు ఇంతేనా?



మా పిల్లల్ని బాగా చదివించుకోవాలని స్కూళ్ళకు పంపుతున్నాం. మా గుడిసెలు తొలగించి మా పిల్లల చదువులకు అడ్డుపడ్డారు. మా పిల్లలు బడికి రావడం లేదని టీచర్‌లు ఫోన్‌లు చేస్తున్నారు. మేము రోజుకొక చోట ఉంటున్నాం. అందుకే మా పిల్లల్ని బడికి ఎలా పంపాలి. తనుకు మరిదమ్మ, బాధితురాలు, ఉండి

● జలపాతం కనువిందు


మండలంలోని మారుమూల అటవీప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మగుడి జలపాతం చూపరులను కనువిందు చేస్తోంది. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలపాతం ఉరకలు వేస్తూ కనువిందు చేస్తూ ఉండడంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. - బుట్టాయగూడెం

శ్రీనివాసుడి దివ్య పవిత్రోత్సవాలు ప్రారంభం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీనివాసుడి దివ్య పవిత్రోత్సవాలు సోమవారం రాత్రి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు యాగశాలలో అంకురార్పణ కార్యక్రమాన్ని జరిపి, ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ఏడాది పొడవున తెలిసీ, తెలియక జరిగిన తప్పుల ప్రాయఃశ్చిత్తం నిమిత్తం ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం ఇక్కడ సంప్రదాయం. దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం పవిత్రాధివాసం, బుధవారం పవిత్రారోహణ కార్యక్రమాలు జరుగుతాయని, గురువారం జరిగే పవిత్రావరోహణ, మహా పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తం అవుతాయని శ్రీవారి ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు.


లక్ష్మీపురం ఆలయ యాగశాలలో అంకురార్పణ సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చివరి దశకు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం

- జిల్లాలో 72 కిలోమీటర్ల మేర నాలుగు లేన్ల రహదారి
- సర్వీసు రోడ్లు నిర్మించాలని కోరుతున్న రైతులు
- అండర్ పాస్ బ్రిడ్జిలు తక్కువ ఎత్తు నిర్మించారని విమర్శలు


పొలాల్లోకి వెళ్ళే రోడ్డు అభివృద్ధి చేయని దృశ్యం


మండలంలో ఎత్తు తగ్గించి నిర్మించిన అండర్‌పాస్ బ్రిడ్జ్

చింతలపూడి: జిల్లాలో ఖమ్మం, దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రహదారి పనులు చివరి దశకు చేరుకున్నాయి. భూములు ఇచ్చిన రైతులకు సర్వీసు రోడ్లు నిర్మించి అభివృద్ధి చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. హైదరాబాద్– విశాఖ మధ్య దూరం తగ్గించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. హైదరాబాద్– విశాఖపట్నం మధ్య 56 కిలోమీటర్ల దూరం తగ్గడమేకాక ప్రయాణ సమయం కూడా తగ్గుతుంది. 162 కిలోమీటర్ల నిడివి గల ఈ రహదారిలో 8 నుండి 10 ఇంటర్‌చేంజ్ పాయింట్లు ఉంటాయి. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో కార్లు, 100 కిలోమీటర్ల వేగంతో భారీ వాహనాలు ప్రయాణించేలా హైవే నిర్మాణం చేపడుతున్నారు. కేంద్ర ఉపరితల రవాణా శాఖామంత్రి నితిన్ గడ్కడీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు రెండు ఫేజ్‌లలో చేపట్టనున్న ఈ జాతీయ రహదారి నిర్మాణానికి 2023లో శంకుస్థాపన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఏలూరు జిల్లాలో 72 కిలోమీటర్ల మేర ఈ జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. 70 మీటర్ల వెడల్పుతో ఎకనామిక్ కారిడార్‌గా ఈ రహదారిని వర్గీకరించారు. జిల్లాలో రెండు దశల్లో నిర్మాణం చేపట్టనున్న ఈ ప్రాజెక్టును పూణేకు చెందిన బెకం ఇన్‌ఫ్రా సంస్థ చేపట్టింది. ఖమ్మం జిల్లా కృష్ణాపురం, తుంబూరు వద్ద నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి ఈ జాతీయ రహదారి ప్రవేశిస్తుంది. చింతలపూడి మండలం, రేచర్ల గ్రామం నుంచి గుర్వాయిగూడెం వరకు 4 లేన్ల రహదారి నిర్మాణానికి 569.37 కోట్లు, గుర్వాయిగూడెం నుంచి దేవరపల్లి వరకు 711.94 కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. మెట్ట ప్రాంతంలో నేషనల్ హైవే అందుబాటులోకి రానుండడంతో రవాణా సదుపాయాలు మెరుగయ్యే అవకాశం ఉంది. రహదారి కోసం మొత్తం 1,411 ఎకరాల భూమి అవసరమవుతుంది. అందులో 114 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా 1,297 ఎకరాలు సేకరించారు. గ్రీన్ ఫీల్డ్ రహదారి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.4,609 కోట్ల అంచనాలతో మొత్తం ఆంధ్ర, తెలంగాణాలో కలిపి 5 దశల్లో రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు.

సర్వీసు రోడ్ల హామీ నెరవేర్చాలి: రైతులు

అయితే తమ వద్ద భూములు సేకరించే సమయంలో అధికారులు పంట పొలాల్లోకి వెళ్ళడానికి సర్వీసు రోడ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని, తీరా రహదారి నిర్మాణం పూర్తి కావస్తున్నా సర్వీసు రోడ్లు అభివృద్ధి చేయలేదని ఆరోపిస్తున్నారు. చింతలపూడి మండలంలో రేచర్ల, జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెం వద్ద తప్ప ఎక్కడా గ్రీన్ ఫీల్డ్ రోడ్ ఎక్కే ఎంట్రీ పాయింట్ లేదు. దీంతో రైతులు, చిరు వ్యాపారులు తమ ఉత్పత్తులను సరుకులను అటు రాజమండ్రి, ఇటు విశాఖ, ఖమ్మం, హైద్రాబాద్ మార్కెట్లకు తీసుకుపోవాలంటే రేచర్ల , జంగారెడ్డిగూడెం లేదా ఖమ్మం జిల్లా వేంసూరు వద్ద తప్ప ఎక్కడా గ్రీన్ ఫీల్డ్ రోడ్డెక్కే వీలే లేదు. అండర్ పాస్ బ్రిడ్జిలు కూడ ఎత్తు తగ్గించి నిర్మించడంతో పామాయిల్ గెలల లోడ్ ట్రాక్టర్‌లు, లారీలు , బోర్‌వెల్స్ లారీలు వెళ్ళ దానికి అవకాశం లేదు. కనీసం అండర్ పాస్ బ్రిడ్జిల ఎత్తు పెంచి నిర్మించినా రైతులకు కొంత మేర ఉపయోగంగా ఉండేది.

సర్వీసు రోడ్లు అభివృద్ధి చేయాలి



భూములిచ్చిన రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. సర్వీసు రోడ్లు అభివృద్ధి చేసి రైతులు పంట భూముల్లోకి వెళ్ళడానికి చర్యలు తీసుకోవాలి. రేచర్ల, వేంసూరు, జంగారెడ్డిగూడెం ఎంట్రీ పాయింట్లకు వెళ్ళి తిరిగి రావాలంటే రైతులు అనేక వ్యయ ప్రయాసలకు గురి కావాలి. గ్రీన్ ఫీల్డ్ రోడ్ పక్కనున్న గ్రామాల ప్రజలకు సైతం రోడ్డు ఎక్కే అదృష్టం లేదు. సమస్యను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలి.

–కంభం విజయరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కన్వీనర్, చింతలపూడి

గోదావరిలో గల్లంతైన యువకుడి మృతి

యలమంచిలి: అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామానికి చెందిన గోకవరపు కృష్ణ (32) ఆదివారం గోదావరిలో గల్లంతైన సంగతి తెలిసిందే. అతని కోసం గోదావరిలో గాలించగా సోమవారం సాయంత్రం మృతదేహం లభ్యమైంది. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శాంసన్‌రాజు తెలిపారు.

కొల్లేరులో మునిగి వ్యక్తి మృతి


కొల్లేరులో మృతదేహాన్ని గాలించి పడవలో తీసుకువస్తున్న దృశ్యం

దెందులూరు: కొల్లేరులో గేదెలు మేపడానికి వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. పైడి చింతపాడు గ్రామ వీఆర్ఓ శ్రీరామమూర్తి కథనం ప్రకారం పైడిచింతపాడు గ్రామానికి చెందిన నోరు రామారావు (38) స్థానికంగా కూలి పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం గేదెలు మేపడానికి కొల్లేరులోకి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. సోమవారం ఉదయం కొల్లేరులో శవమై దొరికాడు. అతను వికలాంగుడు కావడంతో నీట మునిగి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. ఈ ఘనపై పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు.

క్లుప్తంగా

ఎల్.అగ్రహారంలో లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ట



ఎల్.అగ్రహారం గ్రామంలో విఘ్నేశ్వరుని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా పూర్ణాహుతి దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని లక్ష్మీపురం అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, ఆలయ కమిటీ మైలవరపు సత్యనారాయణ, బసిరెడ్డి శ్రీనివాస్, ఇనుకుర్తి రమేష్, నాగాబత్తుల సుబ్రహ్మణ్యం, మంచాల శివయ్య, దారపురెడ్డి పాండురంగ, టీడీపీ నాయకులు పరిమి రవికుమార్, గంధం సతీష్, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీనియర్ సిటిజన్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డిమాండ్స్ డేను నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కురిమెల్ల బాలకృష్ణ, కార్యదర్శి ఎ.జనార్దనరావు, సంఘ సభ్యులచే స్థానిక తహసీల్దార్ సునీల్ కుమార్‌కు వృద్ధుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యవర్గ సభ్యులు బి.హరికుమార్, వైవీఎస్ మూర్తి, గాజుల మురళీకృష్ణ, పీవీ పాపారావు, సీహెచ్ సూర్యప్రకాశరావు, తమ్మిశెట్టి కనకరాజు, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, ప్రత్తి రామకృష్ణ, సంఘ కోశాధికారి ఎండీ ముస్తఫా, బీహెచ్ సత్యనారాయణ రాజు, యర్రా ఆంజనేయస్వామి, తదితరులు పాల్గొని వృద్ధుల సమస్యలపై నినాదాలు చేశారు.

నేతాజీ సుభాష్ చంద్రబోస్ వర్ధంతి



దువ్వలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 80వ వర్ధంతిని తణుకు మండలం దువ్వ గ్రామంలో శ్రీ నేతాజీ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నంబరు 3 పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్ మల్లెల డేవిడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తణుకు ఏఎంసీ చైర్మన్ కొండేటి శివ, పెనుమాక అశోక్, సిర్రా ధనరాజు, కొడమంచిలి కిరణ్, టి.అప్పలస్వామి, కొడవట్ల వీరయ్య, రాచర్ల ప్రకాష్, టి. సర్వేశ్వర రావు, నూతంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

25 ఎకరాల్లో వరి చేలు నీట మునక



నీట మునిగిన వరి చేలను పరిశీలించి, ఏఎంసీ డైరెక్టర్ శ్రీనుతో మాట్లాడుతున్న ఏవో నారాయణరావు

తాడేపల్లిగూడెం రూరల్: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండలంలో 25 ఎకరాలు నీట మునిగిందని మండల వ్యవసాయాధికారి నారాయణరావు సోమవారం తెలిపారు. ఎల్.అగ్రహారం 10, కొత్తూరు, రెండు, దండగర్ర 8, కుంచనపల్లిలో ఐదెకరాల్లో పంట నీట మునిగిందన్నారు. కాగా, పడాల గ్రామంలో నీట మునిగిన వరి చేలను పరిశీలించినట్లు తెలిపారు. చేలలోని నీరు లాగిన తర్వాత కార్బండిజమ్, ఎం.44 లేదా ఈ రెండు కలిసిన స్ప్రింట్ మందును లీటరు నీటికి 1.5 మిల్లీలీటర్ల మందు ద్రావణాన్ని కలిపి పిచికారి చేయాలన్నారు. తద్వారా నీటి ద్వారా వ్యాపించే తెగుళ్లను నివారించవచ్చన్నారు. 10 కిలోల పొటాష్, 10 కిలోల యూరియా వేసుకుంటే మొక్కకు బలం చేకూరుతుందన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అత్తిలి: ఈనెల 20వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన జరిగే ఈసమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

ముంపులోనే వరిచేలు

- అత్తిలి మండలంలో ముంపులో 2వేల ఎకరాలు
- ఆందోళన చెందుతున్న రైతాంగం



అత్తిలి శివారు బొంతువారిపాలెంలో ముంపులో ఉన్న వరినాట్లు

అత్తిలి: అల్పపీడన ప్రభావంతో ఎగతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అత్తిలి మండలంలో పంట చేలు ముంపుబారిన పడ్డాయి. అత్తిలి మండలంలో గల రాచకోడు, ఈర్లకోడు, మంచిలి, ఆరుదలకోడు మేజర్ డ్రెయిన్‌లు పొంగి ప్రవహించడంతో వరినాట్లు నీట మునగాయి. మండలంలో 14,500 ఎకరాలలో వరిసాగు చేపట్టగా వర్షాలకారణంగా మండలంలో 2వేల ఎకరాలలో వరినాట్లు నీటమునిగామయని వ్యవసాయశాఖ అధికారులు నిర్ధారించారు. ప్రతి ఏడాది సార్వాసీజన్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతంనుంచి వరదనీరు యనమదుర్రు డ్రెయిన్ లోకి వచ్చి చేరడంతో పంటచేలు ముంపుబారిన పడి రైతులకు తీవ్రనష్టాన్ని మిగులుస్తోంది. మండలంలోగల ప్రధానమైన రాచకోడు, ఈర్లకోడు, మంచిలి, ఆరుదలకోడు డ్రెయిన్‌ల నుంచి అవుట్ పాల్ స్లూయిజ్‌ల ద్వారా యనమదుర్రు డ్రెయిన్ లోకి చేరుతుంది. అయితే ప్రస్తుతం ఎగువ నుంచి యనమదుర్రు డ్రెయిన్‌లోకి వరదనీరు పెద్దగా రాకపోవడంతో మండలపరిధిలో ఉన్న మేజర్ డ్రెయిన్‌ల నీరు అవుట్‌స్లూయిజ్‌ల ద్వారా యనమదుర్రు డ్రెయిన్‌లోకి చేరుతోంది. వర్షాలు మరి కొన్ని రోజులు కురుస్తాయని వాతావరణశాఖ తెలపడంతో పంటచేలు ముంపు నుంచి ఇప్పుడు కోలుకోలేని పరిస్థితి నెలకొంది. అత్తిలి మండలంలో పాలూరు, ఈడూరు, కొమ్మర, కంచుమర్రు, అత్తిలి శివారు బొంతువారిపాలెం, ఉరదాళ్లపాలెం, బల్లిపాడు, తిరుపతిపురం, వరిఘేడు ఆయకట్టు ప్రాంతంలో వరినాట్లు ముంపులో ఉన్నాయి. ఇప్పటికే వేలాది రూపాయాలు పెట్టుబడులు పెట్టామని, ప్రతి ఏడాది సార్వాసాగులో తమకు పంటనష్టాలు తప్పడంలేదని వాపోయారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి మురునీటి డ్రెయిన్‌లను ఆధునికీకరించి, పంట ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.



అత్తిలి మండలం పాలూరులో నీటమునిగిన వరినాట్లు



అత్తిలి మండలం కొమ్మరలో ముంపులో పంటచేలు



అత్తిలి మండలం ఈడూరులో నీటమునిగిన వరిచేలు

నూతన బార్ పాలసీ గెజిట్ నోటిఫికేషన్ జారీ



ఎక్సైజ్ సీఐ మణికంఠరెడ్డి

తణుకు అర్బన్: నూతన బార్ పాలసీ విధానానికి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు తణుకు ఎక్సైజ్ శాఖ సీఐ సత్తి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 6 బార్లకుగాను ఈనెల 26వ తేదీలోపు దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో అందచేయవచ్చని అన్నారు. తణుకు ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. లైసెన్స్ ఫీజు మొదటి ఏడాది రిటైల్ ఎక్సైజ్ టాక్స్ రూ. 55 లక్షలు చెల్లించాలని ఏడాదికి పది శాతం పెంచి మరో రెండేళ్ల ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో లాటరీ ప్రక్రియ ద్వారా ఈనెల 28న బార్‌లను ఎంపిక చేస్తారని చెప్పారు. ప్రతి దరఖాస్తుకు రూ. 5 లక్షలు నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజుగాను, రూ. 10వేలు నాన్ రీఫెండబుల్ ప్రాసెసింగ్ ఫీజుగా నిర్దేశించినట్లు వివరించారు. ఒక్కో బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు దాఖలయిన పక్షంలో మాత్రమే లాటరీ ఎంపిక నిర్వహించగలమని చెప్పారు. గతంతో పోల్చితే బార్ల పని వేళలు పెంచడం జరిగిందని గతంలో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే ఉండే కానీ ఇకపై బార్‌ల పనివేళలను ప్రస్తుత పాలసీలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు పొడిగించడం జరిగిందని సీఐ మణికంఠరెడ్డి వివరించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



ఇరగవరంలో జగనన్న కాలనీలో ఉధృతంగా ప్రవహిస్తున్న మురుగు డ్రెయిన్



ఇరగవరంలో నీట మునిగిన పంట పొలాలు

ఇరగవరం: అల్పపీడన ప్రభావంతో మండలంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలనీల్లో ఇళ్లలోకి వరద నీరు చేరుకుంది. రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో వరద నీటితో రోడ్లు చెరువులను తలపించాయి. మండలంలో ఇరగవరం, అర్జునుడుపాలెం, గోటేరు, రేలంగి, కత్త పాడు, కాకిలేరు, కొయ్యేటిపాడు, ఏలేటిపాడు, అయిన పర్రు, తూర్పు విప్పర్రు, కె కుముదవల్లి, ఆర్ ఖండ్రిక, కావలిపురం గ్రామాల్లో పెద్ద ఎత్తున పొలాలు నీట మునిగాయి. మరో పక్క గ్రామాల్లోని మురుగునీరు రోడ్ల మీద ప్రవహిస్తుండగా డ్రెయినేజీల్లో మురుగు సరిగా లాగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలు నీట మునగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 5వేల ఎకరాల వరకు పంట నీటిలోనే ఉంది.

రైతులు మెలకువలు పాటించాలి



ఈడూరులో ముంపులో ఉన్న వరిచేనును పరిశీలిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్

అత్తిలి: ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాలలో వరి పంట ఊడ్చిన దశ నుంచి పిలకలు దశలో నీట ముంపుకు గురికావడం జరిగిందని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. సోమవారం ఆయన మండలంలో ముంపుకు గురైన పంటచేలను ఆయన పరిశీలించి రైతులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసిన ఎం.టి.యు 1318, స్వర్ణ, సంపద స్వర్ణ, ఎం.టి.యు 1061 మరియు ఎం.టి.యు 1064 రకాలు ఐదు రోజుల వరకు ముంపును తట్టుకుంటాయన్నారు. పంట ఊడ్చిన వెంటనే నీట మునిగి మొక్కలు చనిపోయిన ఎడల మనేదలు వేసుకోవాలని చెప్పారు. పిలకలు కట్టే దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి, వీలైనంత్త త్వరగా నీటిని తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా మరియు 10 – 15 కిలోల పొటాష్ అదనంగా వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు.

రైతును ఆదుకోవడంలో చంద్రబాబు విఫలం

మాజీ ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పెంటపాడు మండలంలో పలు ప్రాంతాలలో పర్యటిస్తున్న మాజీ మంతి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ఏళ్ల కాలం ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబుకు రైతును ఆదుకోవాలనే ఆలోచన లేకపోవడం విడ్డూరమని మాజీఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన పెంటపాడు మండలంలో తుఫాను బాధిత గ్రామాలైన పెంటపాడు, కె.పెంటపాడు, యానాలపల్లి, పరిమెళ్ల, పడమరవిప్పర్రు తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు గత వారం క్రితం కురిసిన వర్షం వల్ల మునిగిపోయి, కుళ్లిపోయిన నీటి మూనలను రైతులు చూపారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు. ఆధునికీకరణ లేకపోవడం వల్ల ముంపు సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ రైతులనుద్దేశించి మాట్లాడుతూ రైతుల ప్రభుత్వం అని చెప్పుకుంటూ రైతులను చంద్రబాబు విస్మరించారన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా చేసిన చంద్రబాబు దేశానికి వెన్నెముక అయిన రైతును విస్మరించడం తగదన్నారు. ఈ విషయంపై జగనన్న నుంచి చంద్రబాబు ఎంతో నేర్చుకోవాలన్నారు. ఐదేళ్ల పాటు జగనన్న రైతులకు పండుగ చేశారన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, పెట్టుబడి సాయం, రైతుభరోసా, ఆర్‌బీకే తదితర కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కాగా నేడు చంద్రబాబు రైతులకు ఈ క్రాప్ చేయించలేక పోయారన్నారు. ఇప్పటివరకు 10 శాతం కూడా ఈ క్రాప్ చేయించకపోతే రైతుకు ఏ విధంగా ఇన్సూరెన్స్ అందుతుందన్నారు. ఈ విషయంపై కూటమి ప్రభుత్వం ఆలోచించుకోవాలన్నారు. తక్షణం ప్రభుత్వం రైతులను ఆదుకోనేందుకు ఒక ప్రకటన చంద్రబాబు చేయాలన్నారు. ప్రధానంగా ముంపు నీరు లాగేందుకు వీలుగా డ్రెయినేజీలు ఆధుకీకరణ చేయక పోవడం రైతుల శాపం అన్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతున్నా ప్రభుత్వ యంత్రాంగం స్పందించక పోవడం విడ్డూరమన్నారు. తక్షణం రైతులను ప్రభుత్వం ఆదుకోక పోతే తమ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి సూచనలతో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కైగాల శ్రీనివాస్, పార్టీ నాయకులు బోణం వీరయ్య, కొలుకులూరి ధర్మరాజు, కర్రి బాస్కరరావు, కొవ్వూరి భాస్కరరెడ్డి, ముప్పిడి సంపత్‌కుమార్, మిరియాలశేషు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, పొట్ల ఏడుకొండలు, పెంటపాడు, పట్టణ, రూరల్ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాప్రదర్శనను విజయవంతం చేయాలి

తణుకు అర్బన్: సీపీఐ జిల్లా 27వ మహా సభల సందర్భంగా 19న తణుకు పట్టణంలో జరిగే ప్రజా ప్రదర్శన, బహిరంగ సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు చెప్పారు. సోమవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ జిల్లా మహాసభల సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వందలాది మంది సీపీఐ, ప్రజా సంఘాల శ్రేణులతో మంగళవారం సాయంత్రం 4 గంటలకు శ్రీచిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నుంచి ప్రజాప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, ఏరియా కార్యదర్శి సికిలే పుష్ప కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం. సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

పట్టణంలో అదనంగా రెండు బార్లు

తాడేపల్లిగూడెం: జిల్లాలో 28బార్లు ఏర్పాటుకుగాను లాటరీ ద్వారా దరఖాస్తుదారులకు అందచేయడా నికి నోటిఫికేషన్ సోమవారం ఇచ్చారు. ఈ మేరకు పట్టణంలో అదనంగా మరో రెండు బార్లు రానున్నా యి. ప్రస్తుతానికి పట్టణంలో నాలుగు బార్లు ఉన్నా యి. జనాభా దామాషాప్రకారం మరో రెండు బార్లు ఏర్పాటు కానున్నాయి. జనరల్ కేటగిరీలో ఐదు, గీత కార్మికుల కోటాలో శెట్టి బలిజ కులానికి ఒక బారు కేటాయించనున్నారు. ఈ బారుకు సోమవా రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీశా రు. దీనికి 20న నోటిఫికేషన్ ఇస్తా రు. మిగిలిన బార్లకు దరఖాస్తు చేసుకొనే నియమనిబంధనల గురించి ఎక్సయిజ్ సీఐ ఇ.స్వరాజ్యలక్ష్మి తెలిపారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు అందచేయాలని కోరారు.

ఘనంగా గ్రామ దేవతల ఉత్సవాలు

నరసాపురం రూరల్: మండలంలోని తూర్పుతాళ్ల గ్రామ దేవత దండు మారెమ్మ, పేట మారమ్మ అమ్మవార్ల జాతరను పురస్కరించుకొని నిర్వహిస్తున్న సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఖండవల్లి వారిచే నిర్వహించిన జానపద, కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈనెల 17న ప్రారంభమైన ఉత్సవాలు 21వ తేదీవరకూ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ అర్చకులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. తూర్పుతాళ్ల గ్రామ ప్రజలతో పాటు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆర్టీసీ బస్సులు

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికుల ఫీట్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం డిపో నుంచి వెళ్తున్న పలు రూట్లులలో బస్సులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నాయి. బస్సులు హౌస్ ఫుల్, ఆదాయం నిల్ అన్న చందంగా ఉంది ఏపీఎస్ఆర్టీసీ పరిస్థితి. గతంలో ఏదైన పని ఉంటేనే మహిళలు ప్రయాణాలు సాగించేవారు. ప్రస్తుతం ప్రభుత్వం స్త్రీ శక్తి ఉచిత బస్సు కల్పించడంతో పని ఉన్నవారు, లేని వారు బస్సులు ఎక్కడంతో ఆ బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. కొన్ని ప్రధాన రూట్లూలలో బస్సులలో 75 శాతంనకు పైగా మహిళలు కన్పిస్తున్నారు. దీంతో అత్యవసర పనిమీద వెళ్లే వారికి ఇబ్బందులు అంతా ఇంతా కాదు. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిన రెండు రోజులు పాటు బస్సు ప్రయాణం సజావుగానే సాగింది. కాని తరువాత నుంచి బస్సులు ప్రయాణం కష్టసాధ్యంగా మారింది. అవసరం ఉన్నవారికంటే లేని వారే ఎక్కువగా ప్రయాణించడంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. కాంప్లెక్స్ వద్దే చాలా రూట్లూలలో బస్సులు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. దీంతో వివిధ స్టాప్‌లు వద్ద ఆపకుండా బస్సులు వెళ్లిపోతున్నాయి. వెంకి పెళ్లి సుబ్బు చావుకు వచ్చింది అన్న చందంగా బస్సు స్టాప్‌లలో వేచి ఉన్నారు బస్సులు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. కేవలం బస్సు కాంప్లెక్స్‌కు వెళ్లిన వారికే బస్సులు ఎక్కే అవకాశం ఉంటుంది. కొన్ని మార్గాలలో అయితే ఆ సౌకర్యం కూడా కష్టసాధ్యంగా ఉంది. ఇది ఇలా ఉంటే బస్సులు రద్దీగా ఉండటంతో ఊరి పొలిమేరలలో బస్సులను నిలిపి టిక్కెట్లు కొడుతున్నారు. కెపాసిటీకి మించి ప్రయాణీకులు ఉండటంతో అందరికి టిక్కెట్ కొట్టే సమయం ఎక్కువ అవుతుంది. ఉచితంగా ప్రయాణం చేసేవారికి టిక్కెట్ కొట్టాలన్న నిబంధన ఉండటం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతుంది. దీంతో బస్సు ప్రయాణాలు ఆలస్యమవుతున్నాయి. రాకపోకలు ఆలస్యం కావడంతో బస్సులు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఉచిత బస్సులలో వల్లే ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయిని పలువురు మగ ప్రయాణీకులు వాపోతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, బస్సులు ఎక్కేందుకు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది బస్సు ఎక్కలేక ఆగిపోవాల్సి వస్తుంది.

గూడెం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో...

తాడేపల్లిగూడెం ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్‌లో జంగారెడ్డిగూడెం, రావులపాలెం, రాజమండ్రి, భీమవరం, ఏలూరు వైపు రూట్లులో బస్సులు రాగానే ఒక్కసారిగా బస్సు ఎక్కేందుకు ప్రయాణీకులు పోటీ పడుతున్నారు. ప్రయాణీకులు ఒకొరినొకరు గెంటుకోవడం కానవస్తుంది. కిటికీలలో నుంచి సీట్లు కోసం కర్చీఫ్‌లు వేసి ఎగొపెడుతున్నారు. బస్సుల వైపునకు దూసుకువెళ్తున్నారు. బస్సులలోకి వెళ్లిన తరువాత రద్దీ ఎక్కువై సీట్లు కోసం వివాదం, ఘర్షణలు షరా మమూలుగా మారుతున్నాయి. బస్సులు కిక్కిరిసి ఉండటంతో పట్టణంలోని తాలూకా ఆఫీస్ సెంటర్, ఎన్టీఆర్ బొమ్మ, పోలీస్ ఐలాండ్‌లు వద్ద సైతం బస్సులు ఆపకుండా, ప్రయాణీకులను ఎక్కించుకోకుండా కొందరు డ్రైవర్లు ముందుకు వెళ్లి పోతున్నారు.

తగ్గిన ఆదాయం

ఉచిత బస్సు సౌకర్యాం కల్పించడంతో ఆర్టీసీ ఆదాయం గణనీయంగా తగ్గింది. తాడేపల్లిగూడెం బస్సు డిపోకు సంబందించి ఆర్టీసీ డిపో, అద్దెబస్సులు కలిపి సుమారు 35 పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. ఫ్రీ బస్సు కావాలంటే అదనపు బస్సులు అవసరం ఎంతైనా ఉంది. అల్లా పల్లెవెలుగు బస్సులు మరో డిపోనుంచి కాంప్లెక్స్‌కు వస్తాయి. గూడెం డిపోకు ఎక్స్‌ప్రెస్‌లు లేవు. తణుకు డిపో నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్‌లు గూడెం బస్సు కాంప్లెక్స్ రాకుండా పోలీస్ ఐలాండ్ మీదుగా వెళ్లిపోతాయి.

ఇబ్బందులు పడుతున్న కండెక్టర్లు

ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంవల్ల మహిళలు ఎక్కువగా బస్సు ప్రయాణాలు చేస్తున్నారు. బస్సులు అన్ని కెపాసిటీకి మించి ప్రయాణీకులతో నిండిపోవడంతో దీని వల్ల ప్రయాణీకులను బస్సులలో సర్దేందుకు కండెక్టర్లుకు తలప్రాణం తోకకు వస్తుంది. ఇది ఇలాఉంటే ప్రతి ఒక్కరికీ టికెట్ కొట్టాలన్న నిబంధన ఉండటంతో బస్సులోనే ముందునుంచి వెనక్కివెళ్లి టిక్కెట్ కొట్టేందుకు కండెక్టర్లు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కెపాసిటీకు మించి ప్రయాణం చేయడంవల్ల కొన్నిబస్సులు కొన్ని మార్గమధ్యంలోనే నిలిచిపోతున్నాయి. దీంతో ఇటు కండెక్టర్లు, డ్రైవర్లు, ప్రయాణీకులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రయాణం ఆలస్యం కావడంతో కండెక్టర్లుతో పాటు డ్రైవర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మరిన్ని బస్సులు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



పోలీస్ ఐలాండ్ వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు



ఎన్టీఆర్ బొమ్మ వద్ద బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు